క్లుప్తంగా

మంత్రిని కలిసిన డీసీఎంఎస్ పాలకమండలి



కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, బీఎం వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం మహాజనసభ సమావేశంలో చర్చించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా డీసీఎంఎస్‌కు చెందిన పాత రైస్‌మిల్లు స్థానంలో కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, డీసీఎంఎస్ కార్యాలయం భవనాలను నిర్మించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణ చర్యలు చేపట్టేలా సంబంధిత సహకార శాఖ రిజిస్ట్రార్‌కు ఆదేశాలివ్వాలని మంత్రిని కోరారు.

'డీకేడబ్ల్యూ'లో అధ్యాపకులకు శిక్షణ

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులను యూనిసెఫ్ సహకారంతో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ ఎంపథీ అండ్ కైండ్‌నెస్ అండ్ సోషల్ ఎమోషనల్ లెర్నింగ్ అనే అంశంపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ కళాశాలల్లో శిక్షణ తరగతులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోజూ 60 మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా రమణరావు వ్యవహరించారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

నెల్లూరు(బారకాసు): గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వేడుకల్లో పాల్గొనే వారికి అన్ని వసతులను కల్పించాలని తెలిపారు.

చండీ హోమం రేపు

నెల్లూరు(బృందావనం): పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని గురువారం నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో హోమాన్ని ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని చెప్పారు.

రూ.30 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 32వ డివిజన్‌లో ఉన్న ముస్లిం శ్మశానవాటికను రూ.30 లక్షలతో అభివృద్ధి చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం నేతలు పేర్కొన్నారు. డివిజన్లోని శ్మశానవాటికలో లైటింగ్ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో.. కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ చొరవతో దీనిని అభివృద్ధి చేసుకుంటున్నామని చెప్పారు. నేతలు అజీజ్, గౌస్‌బాషా, సర్దార్, మంజూర్, హఫీజ్ సల్మాన్, జావీద్, రహీం, సయూద్, ఆసిఫ్, షఫీ, షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. సభల పోస్టర్లను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఈనెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు మహాసభను ప్రారంభించనున్నారని వివరించారు. పలు తీర్మానాలను ఆమోదించనున్నామని చెప్పారు. సుమన్, ఆరిఫ్, మౌలా, శ్రీను, మురళి, రమేష్, రమణ, రవి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్షలపై చర్చ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను మంగళవారం నిర్వహించారు. తొమ్మిది నుంచి 12వ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు డిజిటల్ సర్టిఫికెట్లతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'సర్వేపల్లి'లో మహిళా ఓటర్లే అధికం

- మొత్తంగా అత్యధిక ఓటర్లు పొదలకూరులో..
- అత్యల్పంగా మనుబోలులో..



వెంకటాచలం: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ ఎం.హరినారాయణన్ విడుదల చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం ఓటర్లు 2,29,116 మంది ఉన్నారు. అందులో మహిళలు 1,17,612 మంది, పురుషులు 1,11,474 మంది, ఇతరులు 30 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేలింది. నియోజకవర్గ పరిధిలోని పొదలకూరు మండలంలో అత్యధికంగా 59,285 మంది, వెంకటాచలం మండలంలో 51,411 మంది, ముత్తుకూరులో 45,436 మంది, తోటపల్లిగూడూరు మండలంలో 41,223 మంది, అత్యల్పంగా మనుబోలు మండలంలో 31761 మంది ఓటర్లున్నారు.

ఏ మండలంలో ఎంతమందంటే..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
పొదలకూరు	28,924	30,352	09
తోటపల్లిగూడూరు	19,885	21,335	03
ముత్తుకూరు	22,141	23,285	10
వెంకటాచలం	25,058	26,349	04
మనుబోలు	15,466	16,291	04

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రగ్బీలో జాతీయ స్థాయిలో, ఇతర క్రీడల్లో జిల్లా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వారికి హిందీ పండిట్ జి.నాగభూషణం తమ పాఠశాల పేరు ముద్రించిన దుస్తులను క్రీడా దుస్తులను వితరణగా ఇచ్చారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో మరింత ప్రోత్సహించేందుకు హిందీ పండిట్ దుస్తులు వితరణగా ఇవ్వడం అభినందనీయమన్నారు. నాగభూషణం మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి తనవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానన్నారు. కార్యక్రమంలో పీడీ శివ నాగబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కట్టా సురేష్, శ్యామ్, కుంజేటి సురేష్, మల్లికార్జునరావు, కుసుమ, హజరత్తయ్య, ఖాజా హుస్సేన్, మాధవి, హసీన పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



వీఎస్‌యూలో..



వెంకటేశ్వర కళాశాలలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. బోస్ చిత్రపటానికి వీసీ జీఎం సుందరవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లో జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సునీత, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: దేశానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందించిన సేవలు చిరస్మరణీయమని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్ కుమార్ కొనియాడారు. బోస్ జయంతిని నార్తురాజుపాళెంలోని కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్ ఎ.హజరత్తయ్య, సి.మధుసూదన్‌రావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ పి.రవికుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.
- విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.వెంకటరమణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పథకాలు అందేలా చర్యలు

కోవూరు: పాడి రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే కాకుండా వారికి అవి చేరేలా పనిచేయాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జీవాలకు అందించేలా పశు సహాయకులు చొరవ తీసుకోవాలన్నారు. పశు ఆరోగ్య సురక్ష కార్డులు వచ్చాయని, వాటిని పాడి రైతులకు అందించాలన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీక్షలో పశు వైద్యులు చంద్రమోహన్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు



మనుబోలు: వివరాలు పరిశీలిస్తున్న డాక్టర్



ఇందుకూరుపేట: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మనుబోలు: ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలను ప్రజల ముంగిటకు చేర్చినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత అన్నారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజల చెంతకు వైద్య సేవలను తీసుకొచ్చేందుకే సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో వైద్యులు వేదవల్లి వాణిశ్రీ, ప్రీతిరెడ్డి, పీఎంఓ వెంకటలక్ష్మి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు హైమావతి, వెంకటరమణయ్య, ఏఎన్ఎంలు సుభాషిణి, రజిత, శివరూపిణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేటలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టేపాటి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు వైద్యసేవలు అందిస్తూ అండగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు, వైద్యులు కిశోర్, బ్రహ్మేశ్వరనాయుడు, జయపాల్‌రెడ్డి, భార్గవి, సర్పంచ్ అస్తోటి జయమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. మండలంలోని లేగుంటపాడు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఇర్ఫాన్, నిరంజన్ పలు సూచనలు చేశారు. అనంతరం ఫేజ్–1లో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న 22 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష మంచి కార్యక్రమమని, దీనిని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి, సుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి తెలిపారు. కోవూరు మండలం లేగుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన శిబిరాన్ని ఆయన పరిశీలించారు.



కోవూరు: మహిళలకు కళ్లద్దాలు పెడుతున్న దృశ్యం

రైతులకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పట్టాలు అందుకున్న వారితో మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అసైన్డ్ భూములకు పట్టాలందించే కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్లుగా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిస్తే వారి కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని గతంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయలేదన్నారు. దశాబ్దాల చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ అభ్యంతరం లేని రెండు లక్షల ఎకరాలకు ఒకే ఒక్క జీఓతో పరిష్కారం చూపిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మేలు చేసిన జగనన్నకు రైతులు అండగా నిలవాలన్నారు.

చర్యలు తీసుకున్నాం

సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 5 మండలాల్లో మొదటి విడతగా 5,445 మంది రైతులకు 6,615 ఎకరాల భూమిని పంపిణీ చేయడం జరిగిందని కాకాణి తెలిపారు. రెండో విడతలో మరో 1,077 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నచెరుకూరు గ్రామంలో 110 ఎకరాలకు డీ ఫాం పట్టాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తోటపల్లిగూడూరు మండలంలో 51 మంది రైతులకు 20.29 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు, నిషేధిత జాబితా నుంచి 54 ఎకరాలను తొలగించి 48 మంది రైతులకు పట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా భూములు పొందిన 148 మంది రైతులకు 97 ఎకరాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను అందించడం జరిగిందన్నారు. రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తుంటే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఆయన ఎన్ని కుట్రలు పన్నినా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని, సర్వేపల్లిలో జరుగుతున్న అభివృద్ధిని ఏ మాత్రం అడ్డుకోలేడన్నారు. ఏది ఏమైనా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో సర్వేపల్లిని అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, తోటపల్లిగూడూరు సొసైటీ చైర్మన్ కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ ప్రత్యూష, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం అగచాట్లపురం, శ్రీహరి కాలనీ, శింగయ్యచేను, అయ్యప్ప నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పొదలకూరు: ఏపీ ఎన్జీఓ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం పొదలకూరు తాలూకా యూనిట్ టేబుల్ క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సందీప్ చక్రవర్తి మంగళవారం పొదలకూరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.విద్యాసాగర్, తాలూకా యూనిట్ నాయకులు కె.శ్రీనివాసులు, చిరంజీవులు, పి.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కులగణన సర్వే

కొడవలూరు: కులగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని యల్లాయపాళెం గిరిజన కాలనీలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులగణన వల్ల అన్ని సామాజికవర్గాల వారికి ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రభుత్వ ఫలాలు ఎలాంటి తారతమ్యాలు లేకుండా జనాభా ప్రాదిపతికన అందజేయడమే ప్రధాన లక్ష్యంగా సర్వే జరుగుతోందన్నారు. సర్వే బృందాలకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి వగ్గ శీనయ్య, వీఆర్వో వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లున్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

పొదలకూరు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఈనెల 24, 25 తేదీ రెండురోజుల పాటు సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలను పొదలకూరు కాకాణి రమణారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, గుర్తింపుకార్డుతో హాజరుకావాలని సూచించారు. ముగింపు కార్యక్రమాన్ని 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేస్తారన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



గౌతమ్‌రెడ్డిని సత్కరిస్తున్న ట్రేడ్ యూనియన్ నేతలు

ముత్తుకూరు: ప్రాజెక్టుల్లో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్ అన్నారు. ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ అయిన పూనూరు గౌతమ్‌రెడ్డిని విజయవాడలో ఆయన మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మిక విభాగాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను, రాబోయే ఎన్నికల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను చర్చించారు. సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి రాజేష్ కుమార్, వైద్య, ఆరోగ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కుమార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



నవీన్ తల్లికి నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గురివిందపూడి గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థికి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారు మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. గురివిందపూడికి చెందిన డి.నవీన్‌కుమార్ తాడేపల్లిలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అతను ప్రస్తుతం నడవలేని స్థితిలో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంతో విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ ప్రత్యూష ఈ విషయాన్ని ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాసులునాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి సాయం అందించారు. ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్ నగదును నవీన్ తల్లికి అందజేశారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కోవూరు: మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో ప్రతిభ చూపారని ఆ కాలేజీ కార్యదర్శి ఎన్.సుధాకర్ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ మహారాష్ట్రలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్లో జేఎన్టీయూ అనంతపూర్ పరిధిలో తమ కళాశాల ఫైనలియర్ సివిల్ విద్యార్థి ఎస్.సాయి కార్తికేయ, హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో ఫైనలియర్ ఈసీఈ విద్యార్థి బి.నిరీహ పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.మురళీకష్ణ, కళాశాల కోశాధికారి వై.విజయశంకర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ యు.పెంచల్‌రెడ్డి, సివిల్ విభాగాధిపతి పి.ఉమా సాయికృష్ణ పాల్గొన్నారు.